## ప్రజలకు సిపిఐ(ఎం-ఎల్)పిలుపు

# బిజెపిని, ఆ పార్టీ మిత్రులను తిరస్కరించండి
# ఇతర పాలకవర్గ పార్టీలను ఎండగట్టండి

## కమ్యూనిస్టు విప్లవకారులను, వామపక్ష, ప్రజాతంత్రశక్తులను బలపర్చండి

**ఒక** నెల రోజులలో లోక్‌సభకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఒక కూటమినుండి మరో కూటమికి మార్పిడులు, విస్తృత ప్రచారాలతో రాజకీయ వాతావరణం ఇప్పటికే నిండిపోయింది. ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను ప్రక్కకు పెట్టటంలోనూ, ఉపశమన చర్యలైన వాగ్దానాల పైకి, ద్వితీయ ప్రాధాన్య అంశాలపైకి ప్రజలదృష్టి మళ్ళించటంలోనూ పాలకవర్గాలు చేయవలసిన అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాయి.

బిజెపి ఐదు సం॥ల పూర్తికాలం అధికారంలో కొనసాగిన తర్వాత ఈ ఎన్నికలు జరగబోతున్నాయి. పెద్దనోట్ల రద్దు, దాని కొనసాగింపుగా విధించిన జిఎస్‌టిలు-రైతాంగ ఆర్థికాన్ని, ఉత్పాదక రంగాన్ని నాశనం చేశాయి. పర్యవసానంగా వ్యవసాయ సంక్షోభం మరింతగా తీవ్రమైంది. తగిన ఉద్యోగావకాశాలు కల్పించటంలో ఆర్థికవ్యవస్థ విఫలమైంది. పెద్దఎత్తున ప్రచారం చేసిన, ఉత్పాదకరంగాన్ని పునరుజ్జీవింపచేస్తుందని ప్రకటించిన 'మేక్ ఇన్ ఇండియా' పథకం ముందుకు సాగలేదు. కౌలురైతులుగా శ్రమచేస్తున్న భూమిలేని రైతాంగం, వ్యవసాయకూలీలు దివాళాతీస్తున్న పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కార్మికుల జీవన, పని పరిస్థితులు దిగజారాయి. 'నిర్దేశిత కాల ఒప్పంద' ఉద్యోగాలతో వారు తమ ఉద్యోగ భద్రతను కోల్పోయి, అసంఘటిత రంగంలోకి విసిరి వేయబడుతున్నారు. వారి నిజవేతనాలు నిరంతరాయంగా పడిపోతున్నాయి. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల అదుపులేకుండా కొనసాగుతుండగా, మధ్యతరగతి వర్గాల ప్రజలకు తమ రోజువారీ అవసరాలను సమకూర్చు కోవటమే కష్టభరితమై అది మరింతగా పెరుగుతోంది. విద్య, వైద్య సేవల ప్రైవేటీకరణ ప్రజల నడ్డివిరుస్తోంది. నిరుద్యోగ పెనుభూతం తమను వెంబడిస్తోండగా ప్రజలకు ఏ ఆశా కానరావటంలేదు. అభివృద్ధి పేరుతో ఆదివాసీ ప్రజానీకాన్ని వారి స్థావరాలనుండి, జీవనాధారాల నుండి గెంటివేస్తున్నారు. పెరుగుతోన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభంతో దళితులు, మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, అణచివేత తీవ్రమౌతోంది. 'అచ్ఛేదిన్' అనేది ఓ ఎండమావిగా మిగిలిపోయింది.

మరోవైపున, బిజెపి ప్రభుత్వం వివిధ రకాల పన్ను రాయితీలు, పన్నులరద్దు ద్వారా బడాబూర్జువావర్గం బలిసిపోయే విధంగా వారికి బడ్జెట్ నిధులను కట్టబెడ్తోంది. రక్షణ రంగంతో సహా ఆర్థిక వ్యవస్థలోని మిగిలిన ఇతర విభాగాలన్నింటిలోకీ విదేశీ పెట్టుబడి ప్రవేశానికి బిజెపి ప్రభుత్వం ద్వారాలు తెరిచింది. విధానాల రూపకల్పనతో సహా ప్రభుత్వాన్ని నడపటంవంటివన్నీ సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థల కనుసన్నలలోనే జరుగుతున్నాయి. ఆవిధంగా మనదేశ ఆర్థిక, సహజ సంపదలన్నింటినీ వరద ప్రవాహంలా సామ్రాజ్యవాద దేశాలు తరలించు కెళుతున్నాయి.

ప్రజాజీవితాలు పేదరికం, దుర్భరత్వంలో మగ్గుతుండగా, ప్రజలలో అసంతృప్తి, అశాంతి పెరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వారు వీధుల్లోకి వస్తున్నారు. పాలకవర్గాలు వారిపై ఫాశిస్టు తరహా నిర్బంధం, అణచివేత విధానాలను అమలుచేస్తున్నాయి.

ప్రజలమధ్య మత, కుల, ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి, విభజించి పాలించే విధానాన్ని కొనసాగించేందుకు బిజెపి మరియు దాని గురుతుల్యమైన ఆర్‌ఎస్‌ఎస్‌కు హిందూ మతతత్వమనేది ప్రీతిపాత్రమైన నినాదంగా వుంది. ఉపశమన చర్యలతో ప్రజల ఆగ్రహాన్ని జోకొట్టడానికి వారు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత సామాజిక, ఆర్థిక వ్యవస్థను పరిరక్షించి, కొనసాగించేందుకే వారు కట్టుబడి వున్నారనేది వాస్తవం.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిస్సిగ్గుగా వారు మత విద్వేషాలను రెచ్చగొట్టారు. గోసంరక్షణ, లవ్‌జీహాద్, గోమాంసం, మతమార్పిడులనే సాకులతో వారు ముస్లిములపై, క్రిస్టియనులపై దాడులు సాగించారు. ముస్లిములకు వ్యతిరేకంగా హిందూమతతత్వ దురహంకారాన్ని రెచ్చగొట్టి గోసంరక్షణ పేరుతో వందమందికి పైగా హత్య గావించారు. మతతత్వ, జాతీయ దురహంకారాన్ని ఎగదోయడానికి వారు అన్ని తిరోగమన వాదనలనూ ఉపయోగించారు, జాతీయవాదాన్ని మతతత్వ దురహంకారంతో సమానం చేసేందుకు, అభివృద్ధి నిరోధక ఆచారాలను పునరుద్ధరించేందుకు వారు ప్రయత్నించారు. 'జాతీయ పౌరసత్వ నమోదు' పేరిట, ఈశాన్య భారతదేశంలోని లక్షలాదిమంది ప్రజల జీవితాలను బిజెపి ప్రభుత్వం గందరగోళంలో పడదోసి ఈశాన్య ప్రాంతంలోని వివిధ జాతుల ప్రజలమధ్య అగాధాన్ని, విద్వేషాల్ని సృష్టించింది.

భారతదేశంలోని ప్రతి పౌరుడి ప్రతి ఫోన్‌కాల్, కదలికలను నమోదుచేసే విధంగా వారిపై నిఘా వుంచే అధికారాన్ని బిజెపి ప్రభుత్వం చేజిక్కించుకుంది. అసంతృప్తి గళాలను అణచి వేసేందుకు గతంలోని ప్రభుత్వాలన్నింటినీ మించి బిజెపి ప్రభుత్వం రాజద్రోహ నేరాలను ఆపాదిస్తూ కేసులు పెట్టింది. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల మతతత్వ ఎజెండాను వ్యతిరేకించే అనేకమంది ప్రజాస్వామికవాదులను కిరాయి గూండాలతో హత్యగావించింది. గౌరీలంకేష్, గోవింద్ పన్సారే, కల్బుర్గీ అలా హత్యకు గురైనవారిలో కొందరు. ఆర్‌ఎస్‌ఎస్ తన అనుబంధసంస్థల ద్వారా తాము హిందూ సంస్కృతిగా భావించే దానిని, ప్రాచుర్యంపొందిన సాహితీ, సాంస్కృతిక వ్యక్తులపై రుద్దడానికి అనేక దాడులు సాగించింది. ఈశాన్య రాష్ట్రాలలోనూ, కాశ్మీర్‌లోనూ సైనిక బలగాల ప్రత్యేకాధికార చట్టాన్ని విధించటం ద్వారా వాస్తవానికి ఆ ప్రాంతాల్లో సైనిక పాలన కొనసాగిస్తోంది. రైతులు, కార్మికులు, విద్యార్థులు, దళితులు, ఆదివాసులు వంటి వివిధ తరగతుల ప్రజానీకం తమ సమస్యల పరిష్కారంకోసం సాగించే ఆందోళనలపై లాఠీఛార్జీలు, పోలీసు కాల్పులతో సహా బిజెపి ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని ప్రయోగించింది.

రాష్ట్రాలకు నష్టం చేకూర్చే విధంగా అధికారాలన్నింటినీ తన చేతుల్లో కేంద్రీకరించే విధానాన్నే బిజెపి ప్రభుత్వం కొనసాగించింది. ప్రణాళికా కమిషన్ స్థానంలో 'నీతీ ఆయోగ్'ను ఏర్పరచటం ద్వారా, రాష్ట్రాలకు నిధులు కేటాయించటంపై ప్రత్యక్ష అదుపును కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంది. జిఎస్‌టి అమలుజేసి, రాష్ట్రాలు తమ ఆదాయాన్ని పెంచుకునే సామర్థ్యాన్ని కత్తిరించింది. తనకు అనుగుణంగా దూడూ బసవన్నల్లా తలలూపని రాష్ట్రాల ప్రభుత్వాలపై తన అధికారాలను ఉపయోగించి కర్రపెత్తనం చేసింది. న్యాయవ్యవస్థను సైతం కేంద్రంలో అధికారంలోనున్న వారి కాంక్షల కనుగుణంగా వ్యవహరించే విధంగా మలిచారు.

అదే సమయంలో, ప్రజలను భ్రమలలో ముంచెత్తటానికి అనేక ఉపశమన చర్యల జాబితాను నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రకటించింది. అసంఘటిత రంగంలోనున్న కార్మికులకు, ఉద్యోగులకు కేంద్రప్రభుత్వం పెన్షను పథకాన్ని ప్రతిపాదించింది. ఉద్యోగాల కొనసాగింపుకు గ్యారంటీ లేకపోయిన తర్వాత, ఈ పథకం క్రింద కార్మికులు లేదా ఉద్యోగులు నెలవారీగా తమ వాటా డబ్బును ఏవిధంగా చెల్లించగలుగుతారు? ఇదంతా పెద్ద దగా మాత్రమే.

ఐదు ఎకరాల వరకు కమతం కలిగివున్న రైతులకు సం॥నికి 6 వేల రూ॥లు సబ్సిడీ ఇస్తామని బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఒకవేళ అమలు అయినా కూడా, ఆ భూమిపై హక్కు పత్రాలు కలిగివున్న వారికి మాత్రమే ఆ సబ్సిడీ మొత్తం అందుతుంది. భూ యజమానులంతా వాస్తవానికి భూమిసాగుదార్లు కాదు. కౌలురైతులుగా, వ్యవసాయకూలీలుగా వ్యవసాయం చేస్తున్నవారు – మొత్తం రైతులలో 60 శాతంగా వున్నారు. ఈ పేదరైతులను ఈ పథకం నుండి ప్రక్కన బెట్టారు. ఇది ఎన్నికల ముంగిట కేవలం ఓట్ల లబ్ధిపొందేందుకు చేపట్టిన మాయా కార్యక్రమం మాత్రమేకాదు. భూమిలేని రైతుల పెరుగుదల; బడావ్యాపార వర్గాల గుత్త వాణిజ్యంద్వారా, సాగు అవసరాలను తయారు చేసే బహుళజాతి కంపెనీలు వ్యవసాయంలో మిగులును గుంజివేసుకోవటం–అనే వ్యవసాయ సంక్షోభ అసలు కారణాల నుండి రైతుల దృష్టి మళ్ళించేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ఇది. ఈ ముసుగులో దీర్ఘకాలంలో ఆర్థిక మీటలను ఉపయోగించి రైతులను వారి భూములనుండి దూరంచేసేందుకు నిర్ణయించు కున్నారు. దీనితోపాటు రైతులను వారి భూముల నుండి బలవంతంగా ఖాళీ చేయించి, బంగారు పళ్ళెంలో బడా వ్యాపారవర్గాలకు అందించే విధానాలను అనుసరిస్తున్నారు.

బిజెపి నాయకత్వంలోని కూటమి భారత ప్రజానీకాన్ని దోపిడీ చేయటానికి, కేవలం సామ్రాజ్యవాద ప్రయోజనాలు పరిరక్షించేందుకే ఈ ఫాశిస్టు విధానాలన్నింటినీ ఉపయోగిస్తోంది. కనుక, రానున్న లోక్‌సభ ఎన్నికలలో దానిని ఓడించాలి.

ఇటీవలి కాలపు ఎన్నికలలో బిజెపి చవి చూసిన ఓటమి, తిరిగి అధికారం అందుకోవాలనే ఆశలను కాంగ్రెస్ పార్టీలో రగిలించింది. గత 5సం॥ల కాలంలో,బిజెపిచేపట్టిన సామ్రాజ్యవాద, బడాపెట్టుబడిదారీ అనుకూలమైన ప్రతి ఒక్క చర్యా తాను ప్రారంభించిందేనని కాంగ్రెస్ పేర్కొంటోంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం జిఎస్‌టి బిల్లును ప్రవేశపెట్టినపుడు, బిజెపి గట్టిగా అరచి కేకలుపెట్టి దానిని వ్యతిరేకించింది. అదే బిల్లును బిజెపి ప్రవేశ పెట్టగా, కాంగ్రెస్ దానిని వ్యతిరేకించింది కానీ, చట్టరూపం తీసుకు నేందుకు తోడ్పడింది. చిల్లర వర్తకం, రక్షణ రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అనుమతించే విషయంలోనూ ఇదే పరిస్థితి వాస్తవంగా జరిగింది. బడాబూర్జువా, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు సేవ చేయటంలో బిజెపితో కాంగ్రెస్‌కు ఏవిధంగానూ తేడా లేకపోవటమే దీనికి కారణం. బిజెపి పాలనాకాలంలో అవినీతి అంశాన్ని, ప్రధానంగా రాఫెల్ ఒప్పంద అంశాన్ని కాంగ్రెస్ తన ప్రధాన ప్రచార అస్త్రంగా చేపట్టింది. బిజెపియొక్క మతతత్వ ఎజెండాకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక విలువల కాలరాచివేతకు వ్యతిరేకంగా పోరాటంచేసే బదులు, హిందూభావోద్వేగాలను సంతృప్తిపరిచే చర్యలతో, అందులో బిజెపికంటే తానేమీ తీసిపోనని చూపెట్టుకునే చర్యలకు పూనుకుంది. ఆవిధంగా భారత సాంస్కృతిక జీవితంలో కొనసాగుతోన్న లౌకిక సాంప్ర దాయాలకు హాని చేకూర్చింది. రైతు రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ, 'సర్వజన కనీస ఆదాయం' వంటి ప్రజాకర్షక పథకాలను ప్రకటించటంలో బిజెపితో కాంగ్రెస్ పోటీపడుతోంది. బిజెపి 'అపసవ్య పాలన' పైనే అది ప్రధానంగా ఆధారపడి, తన స్వీయ అర్థ, అంగబలాలతో ఎన్నికలలో గెలవాలనుకుంటోంది. తన చుట్టూతావున్న విపక్షశక్తులను తన దగ్గరకు చేర్చుకునేందుకు 'బిజెపి మతతత్వ ఫాశిజాన్ని ఓడించండి' అని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది.

ప్రస్తుతం, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో ప్రాంతీయ పార్టీలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. కూటమి ప్రభుత్వాల ఏర్పాటు అనేది రివాజుగా మారిపోయింది. ఎన్‌డిఏ లేదా యుపిఏ ఏర్పాటుకు ఈ ప్రాంతీయ పార్టీలన్నీ బిజెపి లేదా కాంగ్రెస్‌తో చేతులు కలుపు తున్నాయి. ఈ కూటములు పేరుకే తమకు ఉమ్మడి సాధారణ కార్యక్రమముందని ప్రకటించు కున్నప్పటికీ అవి ఎలాంటి ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడీ లేవుగనుకే, తమ రాజకీయ సౌలభ్యానికనుగుణంగా అవి వ్యవహ రిస్తున్నాయి. బిజెడి, జెడి(యు), టిఎంసి, ఏఐడిఎంకె, డిఎంకెవంటి అనేక ప్రాంతీయ పార్టీలు తమతమ రాష్ట్రాలలో దశాబ్దాలకాలంగా అధికారంలో వున్నాయి. అయినప్పటికీ ప్రజలెదుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్య నైనా అవి పరిష్కరించలేదు. బిజెపి, కాంగ్రెస్‌లు అనుసరిస్తున్న విధంగానే ఈ పార్టీలు కూడా ప్రజాకర్షక పథకాలు ప్రకటిస్తూ, పాలకులు విదిల్చే ఎంగిలి మెతుకుల కోసం ఎదురుచూసే బిచ్చగాళ్ళుగా ప్రజలను చూస్తున్నాయి. ప్రజలను దోపిడీకి గురిచేసి బడా పెట్టుబడిదారులను, విదేశీ పెట్టుబడిదారులను బలీయం గావించే ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానా లను అమలుచేయటంలో బిజెపి, కాంగ్రెస్‌లతో జతగూడేవే ఇవన్నీ కూడా. ఈ పార్టీలన్నీ తమ ఓట్ల ప్రయోజనంకొరకు కుల, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, వారిని పోరాట మార్గంనుండి ప్రక్కకు మళ్ళిస్తున్నాయి. ఒక్కసారి అధికారంలోకి రావటంతోనే సామ్రాజ్యవాద పెట్టుబడి ముందు, బడాపెట్టుబడి ముందు అవి సాగిలపడుతున్నాయి. బిజెపి వ్యతిరేక కూటమిని ముందుకు తేవటంలో తనకు తాను కీలక పాత్రధారిగా చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు, ఒకనాడు తనను తాను ప్రపంచ ఒబ్యాంకు సిఇఓగా అభివర్ణించుకున్నాడు. రైతులను బలవంతంగా వారి భూముల నుండి గెంటివేసి, ఆ భూములను గుత్తపెట్టుబడిదారులకు కట్టబెట్టడంలో ప్రాంతీయ పార్టీల నాయకత్వం లోని ప్రభుత్వాలు ముందున్నాయి. కనుక అవన్నీ సంపూర్ణంగా ప్రజావ్యతిరేక స్వభావం కలిగి వున్నాయి.

ప్రాంతీయ పార్టీలతోపాటు కాంగ్రెస్ మరియు దాని మిత్రకూటమి పార్టీలన్నీ సామ్రాజ్యవాద, బడాపెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను పరిరక్షించటంలో ఒక్కటిగా వున్నాయి. విపక్షంలో వుండగా పెద్దగొంతుతో మాట్లాడతాయి కానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావ్యతిరేక విధానాలను అమలు పరచటంలో తమలో తాము ఏకాభిప్రాయాన్ని ప్రదర్శిస్తాయి. వీటిలో ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ ప్రజలకు భ్రమలుండాల్సిన అవసరం లేదు కనుక, వీటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తమ పోరాటాన్ని కొనసాగించాలి.

ఆర్థిక సంక్షోభం పర్యవసానంగా తీవ్ర మౌతున్న రాజకీయ సంక్షోభం, పాలక వర్గాలలోని వివిధ విభాగాల నడుమ వైరుధ్యాలను తీవ్రతరం చేస్తోంది. అధికారం చేజిక్కించు కునేందుకు బిగ్గరగా నినాదాలుచేస్తూ ప్రజల దృష్టిని తమవైపు మరల్చుకునేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. పాలక వర్గాలలోని ఒక విభాగం ఇప్పటికే 'మతతత్వాన్ని వ్యతిరేకించండి' లేదా 'మతతత్వ ఫాశిజాన్ని వ్యతిరేకించండి' అనే నినాదాన్ని ముందుకు తెచ్చింది. ప్రజాస్వామిక, వామపక్షశక్తులు ఈ నినాదాల ప్రభావానికి లోను కారాదు. భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న విభజించి, పాలించే విధానంలో భాగమే ఈ నినాదాలన్నీ అనే వాస్తవంపట్ల వారు జాగరూకులై వుండాలి. హిందూత్వ పేరుతో మతతత్వాన్ని, మత విద్వేషాన్ని రెచ్చగొట్టటంలో బిజెపి నగ్నమైన విధానాలను అనుసరిస్తుండగా, కాంగ్రెస్‌పార్టీ తన లక్ష్యాల సాధనకోసం ముసుగు పద్ధతులను ఉపయోగిస్తున్నది. ప్రజల ఆకాంక్ష లను, తమ జీవన పరిస్థితుల మెరుగుదలకోసం వారి డిమాండ్లను సైతం ప్రాంతీయ, కుల, మతపరమైన విద్వేషాలను ప్రజలమధ్య రగల్చటానికి పాలకవర్గాలు మోసపూరితంగా వినియోగిస్తున్నాయి.

ప్రజాస్వామ్యపు అపహాస్యంగా భారత పార్లమెంటరీ వ్యవస్థ తయారైంది. ఎన్నికల ప్రక్రియకోసం రూపొందించినవిగా చెబుతున్న వివిధ సంస్కరణలన్నీ సాధారణ మానవుడు ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికలలో పాల్గొనటాన్ని మరింత కష్టతరంచేసేవిగా వున్నాయి. డబ్బు సంచులున్న వారు మాత్రమే ఎన్నికలలో పోటీ చేయగలుగుతున్నారు. ప్రచార మాధ్యమాల నుపయోగించి, సమస్యలు కాని వానిపైకి దృష్టిని మరల్చుతున్నాయి. రగులుతున్న వాస్తవిక సమస్యలను ప్రక్కకు తప్పిస్తున్నాయి. ప్రజల దృష్టిని మౌలిక సమస్యలపై నుండి మళ్ళించి, ఏదో ఒక ప్రలోభంతో వారిని మభ్యపుచ్చే చర్యలను పాలకవర్గ పార్టీలు అమలు చేస్తున్నాయి.

ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలను చర్చించేందుకు పార్లమెంటుకు, పార్లమెంటు సభ్యులకు సమయమే వుండటంలేదు. కొందరు పార్లమెంటు సభ్యులు ఏవో కొన్ని ముఖ్యమైన అంశాలు లేవనెత్తినప్పటికీ, అసందర్భమైన అంశాలుగా వానిని ప్రక్కకు తోసివేస్తున్నారు. మరోవైపున, ఉద్దేశ్యపూర్వకంగా బ్యాంకు రుణాలను ఎగవేసిన దోపిడీవర్గాల ప్రతినిధులు దేశంలోని చట్టాలను ఉల్లంఘించినప్పటికీ, పార్లమెంటు శక్తిహీనమై వుండిపోయింది. బడాబూర్జువాలే ఈ ఎగవేతదారులనే విషయం ప్రభుత్వ ఉన్నత స్థానాలలోనున్న ప్రతి ఒక్కరికీ తెలుసు. ఇంతేగాక, సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి చేతుల్లో ఒక పనిముట్టుగా భారత పార్లమెంటు వ్యవహరిస్తోంది. సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు ఆదేశించిన విధంగా స్వేచ్ఛ, అధికారాలన్నింటినీ వారికి అధీనంచేసి, వారి ఆదేశాల కనుగుణంగానే దేశంలో చట్టాలను రూపొందిస్తోంది. ఈవిధంగా భారతదేశంలోని చట్టసభలు కా॥తరిమెల నాగిరెడ్డి ఏనాడో పేర్కొన్న విధంగా కేవలం బాతాఖానీ షాపులుగా మిగిలిపోయాయి.

ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి, పాలక వర్గాలకు, వారి విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో విస్తృత ప్రజారాశులంతా ఐక్యమై, తమకు తాము సంఘటితం కావాలి. దేశ ప్రయోజనాలనన్నీ సామ్రాజ్యవాదులకు అమ్మి వేస్తున్న భారత పాలకవర్గాల ఘోరమైన నేరాన్ని వ్యతిరేకించి, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని వారు ముందుకు సాగించాలి. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా, విప్లవ భూసంస్కరణలకోసం రైతాంగ ప్రజానీకం పోరాటాన్ని కొనసాగించాలి. మౌలిక సమస్యలపై వర్గపోరాటాలలో తమను తాము సంఘటిత పరచుకునే క్రమంలో జరిగే మతతత్వ దాడులను ప్రజలు ధైర్యంగా తిప్పికొట్టాలి. దేశభక్త, ప్రజాస్వామ్యశక్తులతో వారు మమేకం కావాలి.

కమ్యూనిస్టు విప్లవకారులైన మనం, అత్యావశ్యకమైన ప్రజల ఈ పోరాటంలో ప్రజలతో వుంటాం. మార్క్సిజం-లెనినిజంపై ఆధారపడిన కార్మికవర్గ పార్టీ నిర్మాణానికి, కమ్యూనిస్టు శ్రేణులమధ్య ఐక్యతను సాధించ టానికి చిత్తశుద్ధితో కట్టుబడి వున్నాం. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ప్రజలకు మనం ఇలా పిలుపునిస్తున్నాం.

- ***బిజెపిని, ఆ పార్టీ మిత్రులను తిరస్కరించండి***
- ***కాంగ్రెస్‌ను, ఇతర పాలకవర్గ పార్టీలను ఎండగట్టండి***
- ***కమ్యూనిస్టు విప్లవకారులకు, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులకు మద్దతివ్వండి, ఓటువేయండి***
- ***పాలకవర్గాల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతాంగం, పీడిత ప్రజానీకం సమైక్యంగా పోరాడండి.***

**విశ్వం,**<br>ప్రధాన కార్యదర్శి<br>**కేంద్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)**

**14-2-2019**

oooo